క్లుప్తంగా

డిజిటల్ బ్లాక్ బోర్డు ప్రారంభం



వేగేశ్వరపురం ప్రభుత్వ హైస్కూల్లో డిజిటల్ బ్లాక్ బోర్డును ప్రారంభించిన దృశ్యం

తాళ్లపూడి: ఆధునిక టెక్నాలజీ సాయంతో విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తోందని ఎంఈవో సీహెచ్ నెహ్రూజీ అన్నారు. వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులను ఆ పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎంఈవో నెహ్రూజీ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. 'నాడు -నేడు'లో భాగంగా ఈ పాఠశాలలో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశామని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయురాలు బాలామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల వైద్యురాలి నియామకం



డాక్టర్ దేవీశ్రీ

గోపాలపురం: గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ప్రభుత్వం పిల్లల వైద్యురాలిని నియమించినట్టు ఆ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుట్టాయగూడెంలో పనిచేస్తున్న డాక్టర్ పి.దేవీశ్రీ బదిలీపై గోపాలపురం సీహెచ్‌సీలో నియమితులైనట్టు తెలిపారు. త్వరలో గైనకాలజిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లు కూడా ఇక్కడ నియమితులవుతారన్నారు.

ఇన్సులిన్ సిరంజీల వితరణ

నల్లజర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్సులిన్ సిరంజీలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన మానవత సంస్థ మండల శాఖ శనివారం రూ.3 వేల విలువైన ఇన్సులిన్ సిరంజీలను పీహెచ్‌సీకి విరాళంగా అందజేసింది. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, సీహెచ్ఓ ప్రసాద్, వైద్య ఉద్యోగుల సంఘ నాయకుడు జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వే గేట్

కొవ్వూరు: పట్టణంలోని వేములూరు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే గేటు శనివారం సాయంత్రం మొరాయించింది. సాయంత్రం 5.0- -5.30 గంటల మధ్య రెండు రైళ్లు వెళ్లాయి. ఆ సమయంలో రైల్వే గేటును మూసివేశారు. రైళ్లు వెళ్లిన అనంతరం వేములూరు వైపు గేటు తెరుచుకుంది.దీంతో అప్పటి వరకూ వేచి ఉన్న వాహనాదారులందరూ పట్టాలపైకి వచ్చారు. సాంకేతిక సమస్యతో కొవ్వూరు వైపు గేటు మొరాయించింది. దీంతో 15 నిమిషాలకు పైగా జనం రైలు పట్టాలపై ఉండిపోయారు. ఒకరి వెనుక ఒకరు వచ్చేయడంతో వాహనదారులు వెనక్కి వెళ్లే ఛాన్స్ లేకుండా పోయింది. ముందు గేటు మొరాయించడం ముందుకి వెళ్లే అవకా శం లేకపోవడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు. దీంతో రైల్వే సిబ్బంది పరుగులు తీసి అష్టకష్టాలు పడి రైల్వే గేటు తెరిచారు. ఆ సమయంలో ఏ రైలు రాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కుటుంబ సభ్యుల దాడితో గాయాలు

నిడదవోలు రూరల్: కుటుంబ సభ్యులు జరిపిన దాడిలో మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన రొక్కల రాజేష్‌కు తీవ్ర గాయాలైనట్టు సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస శనివారం తెలిపారు. మునిపల్లికి చెందిన రొక్కల సుగుణరావుతో పాటు అతని కుటుంబ సభ్యులైన మరో ఇద్దరి వ్యక్తులు ఈనెల 14న మద్యం సేవించి ఇంటి వద్ద ఇబ్బంది కలగజేస్తున్నారన్నారు. ప్రశ్నించిన రాజేష్‌పై అతని కుటుంబ సభ్యులు దాడి చేశారు. గాయాలైన రాజేష్ తణుకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.రాజేష్ ఫిర్యా దుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం షాదీఖానా వివాదంలో హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన మాజీ సర్పంచ్ ఎండీ అక్రంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం ..ముస్లింలకు చెందిన షాదీఖానా నిర్వహణ అవకతవకల విషయంలో 2020 ఏడాదిలో కొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఆదేశాలతో షాదీఖానాను తహసీల్దార్ ఎం.గంగరాజు స్వాధీన పరుచుకుని సీజ్ చేశారు. ఈనెల 12న మాజీ సర్పంచ్ అక్రం షాదీఖానా తాళాలు బలవంతంగా పగలకొట్టి అక్రమంగా తెరిచారు. తహసీల్దార్ ఎం.గంగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సుభానీ పేర్కొన్నారు.

తల్లితో పాటు పిల్లలు అదృశ్యం

నిడదవోలు రూరల్: రావిమెట్ల గ్రామ శివారు శంకరాపురంలో తల్లితో పాటు ముగ్గురు పిల్లలు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం హెడ్‌కానిస్టేబుల్ జి.రామారావు శనివారం తెలిపారు. గన్నాబత్తుల మేరీలక్ష్మి (32)తో పాటు ఆమె పిల్లలు మోహన్‌లక్ష్మి, లిఖిత, శేషాంత్ హారీష్‌సాయి గణేష్‌లు ఈ నెల 14వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యుడు గన్నాబత్తుల నాగవెంకటసురేష్ ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే మేరీలక్ష్మి భర్త ఆంజనేయులు ఏడాది కింద మృతి చెందారు.

సబ్సిడీ టమాటాలతో ఊరట

- రైతు బజార్‌లో కిలో రూ.50 రేటుకే విక్రయం
- బహిరంగ మార్కెట్‌లో ధర రూ.120 నుంచి రూ.140
- కొవ్వూరు రైతుబజార్ ద్వారా మూడు వేల కిలోల విక్రయం



రైతు బజార్‌లో సబ్సిడీపై టమాటాల విక్రయాలు ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత (ఫైల్)

కొవ్వూరు: టమాటా రేటు టాపు రేపుతోంది. మార్కెట్‌లో కిలో రూ.140 నుంచి రూ.140 కి పైగా ధర పలుకుతోంది. అంత భారం ప్రజలపై మోపరాదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ.50 రేటుకే టమాటాలను అందిస్తోంది. కొవ్వూరు రైతు బజారులో ఈ నెల మూడో తేదీ నుంచి సబ్సిడీపై టమాటాలు విక్రయిస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల్లో మూడు టన్నుల టమాటాలను ఈ రైతు బజార్ ద్వారా విక్రయించారు. ఐదో విడతగా శనివారం 800 కిలోల టమాటాలు కొవ్వూరు చేరుకున్నాయి. మన ప్రాంతంలో టమాటా పంట సాధారణంగా శీతాకాలంలో మాత్రమే సాగవుతుంది. దీంతో రాయలసీమలోని మదనపల్లె, పలమనేరు ప్రాంతాల నుంచి టమాటాలను దిగుమతి చేసుకుంటున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా టమాటా నాణ్యతను బట్టి సరాసరిన కిలో రూ.100 వరకూ పలుకుతోంది. దీనికి రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు అదనంగా పడుతున్నాయి. అంటే ఇక్కడికి చేరేటప్పటికి కిలో టమాటా ధర రూ.110 వరకూ ఉంటోంది. అయినప్పటికీ ప్రభుత్వం ప్రజలకు కిలో రూ.50 రేటుకే సబ్సిడీపై అందించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరో రెండు నెలలు ఆగాల్సిందే

మన ప్రాంతంలోని టమాటా పంట అందుబాటులోకి రావాలంటే మరో రెండు నెలలు ఆగాల్సిందే. కొవ్వూరు, పెరవలి, తాళ్లపూడి, నిడదవోలు మండలాల్లోని సుమారు 300 ఎకరాల్లో వేసిన టమాటా పంట ప్రస్తుతం నారుమడుల దశలో ఉంది. నాట్లు వేసిన మూడు నెలల వరకూ దిగుబడి వచ్చే అవకాశం లేదు. దీంతో స్థానిక టమాటాల కోసం సెప్టెంబర్, అక్టోబర్ నెలల వరకు ఆగాల్సిందేనని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

ఎందుకంత డిమాండ్ ?

ఇటీవల గుజరాత్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల ఆ ప్రాంతాల్లో వేసిన టమాటా పంట తీవ్రంగా దెబ్బతింది. దీనికితోడు పంటకు తెగుళ్ల కూడా సోకడంతో ఆ ప్రభావం దిగుబడులపై చూపింది.ఉత్తర భారతీయులు చపాతీ (రోటీ) ఆహారంగా తీసుకోవడం వల్ల అక్కడ టమాటా వినియోగం కూడా ఎక్కువ. దాంతో రాష్ట్రంలో టమాటాలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. మూడేళ్ల క్రితం కిలో రూ.100 వంద మార్కు చేరిన టమాటా ఇప్పుడు గరిష్టంగా హోల్ సేల్‌లో రూ.124 వరకూ పలికింది. రాష్ట్రంలోని మదనపల్లె మార్కెట్ నుంచే ప్రస్తుతం ఎక్కువగా దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు టమాటా ఎగుమతి అవుతోంది. ఇక్కడి టమాటాలకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా డిమాండ్ ఏర్పడడంతో ధర రోజురోజుకూ పైపైకి చేరుతోంది. ప్రధానంగా మదనపల్లె, పలమనేరు మార్కెట్లపైనే ఢిల్లీ, కోల్‌కత్తా, గుజరాత్, రాయ్‌పూర్, జగదల్‌పూర్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, కోస్తాంధ్ర ప్రాంతాల వ్యాపారులందరూ టామాటాలపై ఆధారపడ్డారు. అందుకే డిమాండ్ పెరుగుతుంది. ఈనెలాఖరు నాటికి అనంతపురం ప్రాంతంలో వేసిన 700 హెక్టార్లలోని పంట మార్కెట్‌కి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పంట అందితే నెలాఖరు నాటికి టమాటా ధర కాస్తా తగ్గే సూచనలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

సబ్సిడీపై సరఫరా హర్షణీయం



టమాటా ధర భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ.50 రేటుకే అందించడం హర్షణీయం. రైతు బజారు ద్వారా టమాటాలు తక్కువ రేటుకే అందించడం పేదలకు ఎంతో ఉపయుక్తం.

– గుర్రాల మంగ, గృహిణి, 23వ వార్డు, కొవ్వూరు

కుటుంబానికి కిలో చొప్పున..



మదనపల్లె, పలమనేరు ప్రాంతాల నుంచి ఇప్పటి వరకూ 3 టన్నుల టమాటాలు దిగుమతి చేసుకున్నాం. ఒక్కో కుటుంబానికి కిలో చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై రూ.50 రేటుకే అందిస్తోంది. ఆధార్ నంబర్ ఆధారంగా వాటిని విక్రయిస్తున్నాం. టమాటాకు ప్రత్యామ్నాయంగా చింత పండు, చింత చిగురు వంటివి కూడా వినియోగించుకోవచ్చు.

– సీహెచ్ సత్యనారాయణ, ఎస్టేట్ ఆఫీసర్, రైతు బజార్, కొవ్వూరు

వలంటీర్లకు వందనం

అన్ని పథకాలూ అందుతున్నాయి



గోపాలపురంలో కరోనా వేళ వలంటీర్ చేతుల మీదుగా కూరగాయలు అందుకుంటున్న అరుణ

మండల కేంద్రమైన గోపాలపురానికి చెందిన జగతా వెంకటలక్ష్మి, త్రిమూర్తులు దంపతులకు అరెకరం పొలం ఉంది. వచ్చే ఆదాయం సరిపోక ఇబ్బంది పడేవారు. గత ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదు. ప్రభుత్వ పథకాల గురించి అవగాహన లేదు. ఏమీ తెలియని స్థితిలో ఉండగా జగన్ ప్రభుత్వం వచ్చాక గ్రామ వలంటీర్ ముప్పన కృపావరప్రసాద్ రెడ్డి ఇంటికి వచ్చి పథకాల గురించి అవగాహన కల్పించారు. దగ్గర ఉండి దరఖాస్తు పెట్టించాడు. ఇప్పుడు అన్ని పథకాలు వచ్చేలా వలంటీర్ కృషి చేశారు. రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, పింఛన్, వైఎస్సార్ చేదోడు వంటి పథకాల క్రింద ఏటా రూ.75 వేలు వస్తున్నాయి. వీటిలో కుటుంబం ఆనందంగా ఉంది. ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు.

– దేవరపల్లి

ప్రాణాలు పణంగా పెట్టి సేవలు



కరోనా సమయంలో అయినవాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. బయటకు వచ్చే పరిస్థితి లేదు. అలాంటి సమయంలో వలంటీర్ అయినం పవన్ కళ్యాణి ప్రాణాలకు తెగించి సేవలు చేసింది. దాతలు ఇచ్చిన కూరగాయలు, నిత్యావసర సరుకులు ఇంటికి తెచ్చి ఇచ్చింది. ప్రతి రోజు వచ్చి చూసి ధైర్యం చెప్పేది. రెడ్ జోన్‌లో కూడా విధులు నిర్వహించి సేవలు అందించి అండగా నిలిచింది. వలంటీర్ సేవలు మరువలేనివి. పిల్లలకు అమ్మఒడి పథకం రావడానికి వలంటీర్ కృషి చేసింది.

– భర్తతో జామి అరుణ, గోపాలపురం

చేపల వినియోగం పెంచడమే ఫిష్ ఆంధ్రా లక్ష్యం

హోం మంత్రి తానేటి వనిత



లైవ్ ఫిష్ విక్రయించే వాహనాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ఫిష్ ఆంధ్రా పథకం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన చేపలు అందించడమే గాకుండా, తలసరి వినియోగాన్ని పెంచడం లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. లైవ్ ఫిష్ ట్రస్‌పోర్టు వాహనాన్ని మంత్రి శనివారం రాత్రి కొవ్వూరులోని తన క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వినియోగదారులకు బతికి ఉన్న తాజా చేపలను విక్రయించేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా వాహనాలు అందిస్తున్నామన్నారు. పట్టణంలో అచ్చాయమ్మ కాలనీకి చెందిన పేరూరి శివరామకృష్ణకు రూ.మూడు లక్షల విలువైన ఆటోను లైవ్ ఫిష్ విక్రయించుకునేందుకు అందించారు. ఈ వాహనాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. పీఎంఎంఎస్‌వై ద్వారా బతికి ఉన్న చేపలు, చేప విత్తన రవాణాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం సబ్సిడీపై ఈ వాహనాలను అందజేస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా 'మాలకోడు' ప్రక్షాళన

- అధికారులకు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఆదేశం
- నీటి వనరుల అభివృద్ధికి శంకుస్థాపన



నీటి వనరుల అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: స్థానిక మాలకోడు మురుగు చెరువు ప్రక్షాళన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 4.33 ఎకరాల్లో విస్తరించి ఉన్న మాలకోడు చెరువు ప్రక్షాళన పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ నిధులు రూ. 87 లక్షల వ్యయంతో ఈ చెరువు నీటి వనరుల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దీర్ఘకాలంగా మాలకోడు మురుగు చెరువు నిరాదరణ గురైందన్నారు. ఫలితంగా పట్టణంలో మురుగు పారుదల అస్తవ్యస్థంగా తయారవడంతో ప్రజలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఈ చెరువు ప్రక్షాళనలో భాగంగా చెరువు చుట్టూ ప్లాంటేషన్, పూడికతీత, వాకింగ్ ట్రాక్ నిర్మాణం పనులు చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, పడాల శిరిష, ఎండీ షకీరాబేగం, అహ్మదున్నీసాబేగం, గోపిరెడ్డి శ్రీనివాస్, మున్సిపల్ డీఈ ఎ.మాధవి, ఏఈ ఎస్.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారులకు న్యాయం చేయాలంటూ ధర్నా

కొవ్వూరు: గోపాలపురం మండలం భీమోలు గ్రామంలో ల్యాండ్ సీలింగ్ యాక్టు ప్రకారం 1974లో పట్టాలు ఇచ్చిన భూములపై విచారణ జరిపి పట్టాదారులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఈ గ్రామంలోని 300 ఎకరాల్లో భూస్వామి కౌలుదారులను సృష్టించి కోర్టులకు వెళ్లారని, కోర్టులు సైతం భూ స్వాములకు కొమ్ము కాస్తున్నాయని ఆరోపించారు. ల్యాండ్ సీలింగ్‌లో భాగంగా 145 మంది పేదలకు 1974లో పట్టాలిచ్చి భూహక్కు కల్పించారన్నారు. పట్టదారులు భూముల్లో సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు పట్టాదారులకు నోటీసుల ఇవ్వడం ద్వారా ప్రభుత్వం కౌలుదారులకు కొమ్ము కాస్తున్నట్టు ఉందన్నారు. పట్టాదారులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని ప్రకటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండల రావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా మండలాభివృద్ధి

- ఎంపీపీ కాకర్ల నారాయుడు
- కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు: ప్రణాళికాబద్ధంగా మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు.ఆయన మాట్లాడుతూ రూ.3.16 కోట్ల మండల పరిషత్ సాధారణ నిధులతో మండల వ్యాప్తంగా 200 పనులు చేపట్టామన్నారు. వాటిలో ఇప్పటికే రూ.1.01 కోట్ల విలువైన 63 పనులను పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. రూ.61.20 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలంలో 37 పనులు చేపట్టగా, వాటిలో పది పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రూ.82 లక్షల 15వ ఆర్థిక సంఘం టైడ్ నిధులతో 73 పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. సీతంపేటలో రూ.6 లక్షల వ్యయంతో రెండు పనులు, ఆరికిరేవుల్లో రూ.6 లక్షల వ్యయంతో నాలుగు పనులు చేపట్టేందుకు, తొమ్మిది గ్రామాల్లో రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణానికి అదనపు మొత్తంగా రూ.6 లక్షలు, 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ నుంచి తొమ్మిది గ్రామాల్లో ఆర్బీకే నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ సమావేశంలో తీర్మానించారు. అంతకు ముందు శాఖ వారీగా అధికారులు నివేదికలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి సభ్యులకు వివరించారు.ఎంపీడీవో కె.సుశీల, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీడీవో కార్యాలయ ఏవో కె.ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

268 ఉపాధి పనులకు ఆమోదం

మండల వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే 269 పనులకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ధర్మవరం, మద్దూరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో రూ.30.19 లక్షల వ్యయంతో 20 పనులు చేపట్టేందుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఆరికిరేవుల, కుమారదేవం, నందమూరు, పశివేదల, సీతంపేట గ్రామాల పరిధిలో 112 ఉపాధి హామీ పనులకు రూ.27.93 లక్షలు కేటాయించారు. ఆరికిరేవుల, కాపవరం, ఐ.పంగిడి, నందమూరు, పశివేదల, వాడపల్లి గ్రామాల్లో 52 పనులకు రూ.2.01,98,559 ఉపాధి నిధులు కేటాయించారు. దొమ్మేరు, కాపవరం , కుమారదేవం, పెనకన మెట్ట గ్రామాల్లో 50 పనులను రూ.25.64 లక్షలు, తోగుమ్మి, పశివేదలలో 33 పనులను రూ.38.76 లక్షలు, ఐ.పంగిడిలో ఒక పనిని రూ.20.28 లక్షల ఉపాధి నిధులతో చేపట్టాలని నిర్ణయించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నిడదవోలు 13వ వార్డులో గడప గడపకూ..



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకూ వెళ్లిన శ్రీనివాస్‌నాయుడు ప్రభుత్వం ద్వారా వారికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. బుక్‌లెట్‌లు అందజేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను అధికారులకు తెలియజేసి అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఏ గడపకు వెళ్ళినా ప్రజలు చిరునవ్వుతో స్వాగతం పలుకుతున్నారన్నారు. ప్రధానంగా పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు, వితంతువులు, మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఏ పథకం కావాలన్నా వలంటీర్లకు చెబితే వారే దరఖాస్తు చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ మొదలవలస నాగమణి, పడాల శిరీష, అహ్మదున్నీసా బేగం, ఎండీ షకీరాబేగం, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయులు పాల్గొన్నారు.

సురక్షతో అర్హులందరికీ పథకాలు

- ప్రజా సమస్యల సత్వర పరిష్కారం
- హోం మంత్రి తానేటి వనిత
- పలుచోట్ల జగనన్న సురక్ష శిబిరాలు



చాగల్లులో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న మంత్రి తానేటి వనిత



తిమ్మాపురంలో మహిళకు రేషన్ కార్డు ఇస్తున్న ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే తలారి

చాగల్లు: అర్హులందరికీ పథకాలు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు-1, 2 సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో చాగల్లు-1 నుంచి 509 మందికి, చాగల్లు-2 నుంచి 834 మందికి వివిధ రకాల ధ్రువ పత్రాలను హోం మంత్రి తానేటి వనిత లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత చాగల్లు వాసుల నుంచి వినతులు స్వీకరించారు. రోడ్లు, డ్రైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఆత్మ చైర్మన్ గంద్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా ఏడుకొండలు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, ఎంపీడీఓ బి.రామ్‌ప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకే..

ద్వారకాతిరుమల: నవరత్న సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. కలెక్టర్ ప్రసంగిస్తూ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరిన మీదట మండలంలో రోడ్లు, డ్రైనేజీలకు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు అందనివారు ఎవరూ ఉండకూడదన్నది జగనన్న ఆశయమన్నారు. మండలంలో సురక్ష కార్యక్రమం ద్వారా 442 దరఖాస్తులు అందాయని, వాటన్నింటినీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్‌తో కలసి ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాలు అందించారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, వారికి పౌష్టికాహార కిట్లు అందజేశారు. సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే తలారి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో లబ్ధిదారులకు అమ్మఒడి మెగా చెక్కు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీవో ఏవీ సుబ్బారాయన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల మండలం సుభద్రపాలెంలో..

నల్లజర్ల: సుభద్రపాలెం గ్రామంలో సర్పంచ్ చవ్వాకుల వెంకటలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు 700 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖరం, ఎంపీటీసీ సభ్యుడు బిరుదుగడ్డ ప్రసాద్, ఉప సర్పంచ్ కైలా నాగభూషణం, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మండలం రామన్నపాలెంలో..

దేవరపల్లి: రామన్నపాలెం సచివాలయం వద్ద సర్పంచ్ కూచిపూడి బుల్లారావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష సభలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు,ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: గోపాలపురం సచివాలయం- 2లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా 13 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అలాగే ఆరుగురు పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంక, తాళ్లపూడి సచివాలయాల వద్ద

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక, తాళ్లపూడి సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 11 రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభొట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వినర్‌కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ యాళ్ల స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం పెట్రోల్ బంక్ వద్ద కారు ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. సమిశ్రగూడేనికి చెందిన షేక్ షారుక్‌తో పాటు నాయనమ్మ జిలానున్నీషా బేగం (65) బైక్‌పై శనివారం రాత్రి పెట్రోల్ బంక్‌లోకి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలైన జిలానున్నీషాబేగంను అత్యవసర వైద్యసేవల కోసం ఆసుపత్రికి తరలించారు. సమిశ్రగూడెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు నమోదు చేసుకున్నారు.

దేవరపల్లి మహేంద్ర ట్రాక్టర్స్‌షోరూమ్ నందు పనిచేయుటకు కావలెను
» బ్రాంచ్ ఇన్‌ఛార్జ్ - 1
» వర్క్‌షాప్ ఇన్‌ఛార్జ్ - 1
» సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ - 2
(గోపాలపురం, తాళ్ళపూడి మండలాలకు)
నేరెళ్ళ రాజా ఆటోమొబైల్స్
ఏలూరు 534005. సెల్: 9347112218

